క్లుప్తంగా

రేపటి నుంచి పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఈ నెల 18 నుంచి పల్లెబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ తెలిపారు. ఈ నెల 18న బూచిపల్లి, 19న సంపతికోట, 21న మల్లెల, 22న బూర్లపల్లి, 23న పోతుపేట, 24న తుమ్మరకుంట, 26న నవాబుకోట, 28న టి.సదుం, 29, 30న రంగసముద్రం, వచ్చే నెల 1న రాపూరివాండ్లపల్లి, 2న మడుమూరు, 4న మద్దయ్యగారిపల్లి, దేవప్పకోట, 5న కాటనగల్లు, 7న పులికల్లు, 8,11న కందుకూరు, 12న పట్టెంవాండ్లపల్లి, 13,15న మొరుసుపల్లి, 16, 19న పెద్దతిప్పసముద్రం, 20న అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతాయన్నారు. అన్ని శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు తప్పక హాజరై పల్లెబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సారా విక్రేత అరెస్ట్

పీలేరు రూరల్ : నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. సెబ్ అధికారులకు అందిన సమాచారం మేరకు మండలంలోని జాండ్ల పంచాయతీ జాండ్లలో బుధవారం దాడులు నిర్వహించారు. మూడే అరుణ సారా కలిగి ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడులో ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యగానంద్, సుధాకర్, లోకేష్ పాల్గొన్నారు.

వార్డు సభ్యులు ఏకగ్రీవం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మల్లెల, తుమ్మరకుంట,రాపూరివాండ్లపల్లి గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న మూడు వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారాయణ బుధవారం పేర్కొన్నారు. మల్లెల 6వ వార్డుకు సభ్యునిగా టి.జనార్దన్, రాపూరివాండ్లపల్లి 7వ వార్డుకు వెంకటాచలపతి, తుమ్మరకుంట 8వ వార్డుకు లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపివేయాలి

బి.కొత్తకోట: మూడు నెలల క్రితమే ఉపాధ్యాయుల బదిలీ జరిగిందని, ప్రభుత్వం మళ్లీ చేపట్టిన సర్దుబాటు బదిలీలను నిలిపివేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నిరంతర సర్దుబాటు చేస్తూ పోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని, దీన్ని విరమించుకోవాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

తంబళ్లపల్లె: కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ మునికుమార్ బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. ఉప్పులూరివాండ్లపల్లెలో 42 మందికి, పంచాలమర్రిలో 24, దండువారిపల్లెలో 32 మందికి పలు రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీహెచ్‌ఈవో రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులతో దాత రమాదేవి

తంబళ్లపల్లె: కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే సామగ్రిని దాత పంపిణీ చేశారు. రిటైర్డ్ టీచర్ రమాదేవి తన భర్త రఘుపతి జ్ఞాపకార్థం నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు అందజేశారు. ఎంఈవో–2 శ్రీనివాసులు, హెచ్‌ఎం వెంకటరమణ, రిటైర్డ్ టీచర్ జీవి ప్రసాద్ ఆమెను అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు దాతను సన్మానించారు. అలాగే ఎద్దులవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో రైతు, వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి 1–5వ తరగతి పిల్లలకు నోటుపుస్తకాలు,పెన్నులు, పలకలు,పెన్సిళ్ళు పంపిణీ చేశారు.

లాభాల గంగమ్మకు వెండి కవచాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న దాత ప్రణయ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కురబలకోట: మదనపల్లె పట్టణం పుంగనూరు మార్గంలో బైపాస్ రోడ్డులోని లాభాల గంగమ్మ అమ్మవారికి కురబలకోట మండలం జంగావారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ యూత్ లీడర్ కె. ప్రణయ్‌కుమార్ రెడ్డి రూ.50 వేలు విలువ చేసే వెండి కవచాలను బుధవారం బహూకరించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక దర్శనం, పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం

పెద్దతిప్పసముద్రం: అధిక శ్రావణమాసం, అమావాస్య సందర్భంగా బుధవారం స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం , లక్ష్మీకుబేర పాశుపతహోమం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి నిర్వహించారు.

తప్పులు లేని ఓటరుజాబితా తయారీ

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



ఓటరుజాబితా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : నియోజకవర్గంలో తప్పులు లేని ఓటరుజాబితా తయారీకి అందరూ సహకరించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఓటరుజాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు, ఈఏఆర్వోలు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణ ఈనెల 21 వరకు జరుగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి ఓటరుజాబితాను పరిశీలించడం జరుగుతోందన్నారు. ఓటర్ల జాబితాలో పోలింగ్ కేంద్రాల వారీగా కొత్తగా నమోదైన వారు, చేర్పులు, మార్పులు, తొలగింపుల జాబితా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇవ్వడం జరిగిందన్నారు. అనవసరమైన ఫిర్యాదులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో అన్ని జాబితాలను పారదర్శకంగా అందరికీ పంపిణీ చేశామన్నారు. ఆ జాబితాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. ఇంకా ఏమైనా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. నూటికి నూరు శాతం స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారు చేయాలన్నదే ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశమన్నారు. ఇంటింటికీ ఓటరు సర్వే కార్యక్రమాన్ని బీఎల్వోలు పక్కాగా చేపట్టేలా చూడాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిపోయిన ఓటర్ల వివరాలు పరిశీలించాలని సూచించారు. సవరణల కోసం ఫారం–8 సేకరించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకే పోలింగ్ కేంద్రంలో డబుల్ ఎంట్రీ, డెత్‌కు సంబంధించి ఫిర్యాదులు రాకూడదన్నారు. బీఎల్వోల నుంచి ఫైనల్ రిపోర్ట్ తీసుకునే సమయంలో సూపర్‌వైజర్లు పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు జంగాలశివరాం, కాంగ్రెస్‌పార్టీ రెడ్డిసాహెబ్, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, సీ.ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

– మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : పట్టణంలోని చంద్రాకాలనీ డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆమె అక్కడి సమస్యలపై స్థానిక కౌన్సిలర్ ఆర్.వి.శివారెడ్డి, ప్రిన్సిపాల్ వసుంధరాదేవితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశమై కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ... గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన, రుచికరమైన భోజనం, భద్రతాపరంగా మంచి సెక్యూరిటీ అందుతున్నట్లు విద్యార్థినులు తెలిపారన్నారు. మౌలికవసతుల దృష్ట్యా చిన్న చిన్న ఇబ్బందులు, పాఠశాల పరిసరాల్లో ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో పాములు, దోమలతో ఇబ్బందిగా ఉన్నట్లు చెప్పుకొచ్చారన్నారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధరాదేవి అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారన్నారు. అయితే విద్యార్థినుల భద్రత దృష్ట్యా వారి తల్లిదండ్రులు పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో తమ సొంత నిధులతో చిన్న చిన్న పనులు చేసుకుంటామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. పేరెంట్స్‌కమిటీ పేరుతో గురుకుల పాఠశాలలో సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విద్యార్థిసంఘ నాయకులు ఆరోపించిన నేపథ్యంలో విద్యార్థినుల తల్లిదండ్రులను పిలిపించి విచారించామన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూతను అందించాలనే సదుద్దేశంతో స్వచ్ఛందంగా విరాళాలు వేసుకున్నట్లు చెప్పారన్నారు. ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందికి ప్రమేయం లేదని రాతపూర్వకంగా రాసిఇచ్చినట్లు చెప్పారు. గతంలోనూ ఎమ్మెల్యే నవాజ్‌బాషా పాఠశాల పర్యటనలో విద్యార్థినులు నీటిసమస్యను ఆయన దృష్టికి తీసుకువస్తే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తక్షణమే సమస్యను పరిష్కరించామన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం పీలేరు పట్టణంలోని మల్లెలవారి వీధి, దిల్షాద్‌నగర్, షుకూర్ థియేటర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వివరాలు చదివి వినిపించారు. అలాగే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కుల, మత, రాజకీయ వర్గ భేదాలు లేకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. స్థానికంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలు తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో పట్టణానికి ప్రత్యేక ప్రతిభావంతుడు యల్లయ్యకు ట్రైసైకిల్ పంపిణీ చేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఈ నెల 26న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. బుధవారం మెగా జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్‌మేళాలలో 20 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు.18 నుంచి 28 సంవతసరాల వయస్సు కల్గిన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ మహితాఆనంద్, హరిత, చలపతి, నరసింహారెడ్డి, హుమయూన్, శ్రీనాథరెడ్డి, ఉదయ్‌కుమార్, మునీర్, అబీద్, పెద్దోడు, హబీబ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటాం



సింగర వెంకట్రమణ

కలకడ : ఏళ్ల నాటి తమ శ్రమకు, జీవిత జీత భత్యాలకు భద్రత కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వైఎస్సార్‌టీయూసీ మెడికల్ అండ్‌హెల్త్ జిల్లా అధ్యక్షుడు సింగర వెంకట్రమణ అన్నారు పేర్కొన్నారు. 2014 ముందు నాటి నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయనుంది. బుధవారం కలకడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారినా, కాంట్రాక్ట్ ఉద్యోగుల కష్టాలను గుర్తించలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఎన్నికల మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నా కేవలం ఇచ్చిన మాటకు కట్టుబడి వేల కుటుంబాలకు లబ్ధి చేకూరేవిధంగా నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. 77 వ స్వాతంత్ర దినోత్సవం రోజు కాంట్రాక్ట్ ఉద్యోగులకు స్వేచ్ఛను, ఉద్యోగ భద్రతను కల్పించి చిరుద్యోగుల ముఖాల్లో చిరునవ్వును చిందించారని గుర్తు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐక్యతలో పాలు పంచుకున్న వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఆదాల వెంగల్‌రెడ్డి , చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సి.సురేంద్ర రెడ్డిల సహకారం, ఉద్యమాల సారథులకు కృతజ్ఞతలు తెలిపారు.

లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం



వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో బుధవారం లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాతసేవతో కార్యక్రమాలు ప్రారంభించి స్వామివారికి జలాభిషేకం, పాలాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూతి అభిషేకాలు చేశారు. అనంతరం కన్నులపండువగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై మహాశివుడికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ట్రస్టు సభ్యులు మురళి, సారధి పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు

పీలేరు : పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గం గరుడాద్రి నగర్‌లో రూ.10 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన డ్రైనేజీ పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు పంచాయతీ నిధులు డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మల్లికార్జున రెడ్డి, అబీద్, శ్రీనాథరెడ్డి, రమణ, నాయకులు కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం



ఉర్దూ భాషా కవిని సన్మానిస్తున్న దృశ్యం

కలికిరి: దేశ సమైగ్రత కోసం తాము ఏలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటామని సున్ని మాసాయిఖీన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ జకావుద్దీన్ సాహెబ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి మండలంలోని మహల్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏక్ షామ్ ఆజీదీకే నామ్ పేరిట అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగా స్వాతంత్ర్యం లభించిందన్నారు. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ మాట్లాడుతూ మత సామరస్యం, జాతీయ సమైఖ్యతను పెంపొందించేందుకు దోహదపడేలా ఉర్దూ కవి సమ్మేళనాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉర్దూ భాషలో నిర్వహించే కవి సమ్మేళనాలతో ఐక్యత సాధ్యమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉర్దూ బాషాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఉర్దూ కవులు దేశభక్తికి సంబంధించిన కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో కడప షహమీరియా దర్గా పీఠాధిపతి సయ్యద్ హుస్సేని బాషా సాహెబ్ షహమీరి, ముస్లిం సున్ని మషాయకిన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘా మొహిద్దీన్, నేతలు నఖీవుల్లా, పలు జిల్లాలకు చెందిన పీఠాధిపతులు, ఉర్దూ సాహితీవేత్తలు, సాహితి ప్రియులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న నవరత్నాలు ప్రజల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ వెంగళవారికురవపల్లె, పెద్దరాజులపల్లె, నాగంవారిపల్లె, గండిమాలపల్లె, బోడిబండ, గంగాపురంపల్లె గ్రామాల్లో బుధవారం సాయంత్రం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అలాగే నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినది వివరించారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా అమలుచేస్తున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నవరత్నాల రూపంలో అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని చెప్పారు. అమ్మ ఒడి, ఆసరా, సున్నావడ్డీ, చేయూత వంటి అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్నారన్నారు. ఒకటో తేదీనే ఇంటి వద్ద పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కలకాలం అమలుజరగాలంటే.. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జైప్రకాష్‌రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, యుగంధరరెడ్డి, నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాసులు, హనుమంతు, శ్రీరాములు, మహమ్మద్‌రఫీ, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ కరీముల్లా



కరీముల్లాను సన్మానిస్తున్న మౌజన్లు, ఇమామ్‌లు

గుర్రంకొండ: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ కరీముల్లా అన్నారు. బుధవారం గుర్రంకొండ, సంగసముద్రం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక షంషేర్‌వలీ దర్గాను సందర్శించి చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి దర్గా మాన్యం భూములపై నెలకొన్న వివాదం, సమస్యపై సంగసముద్రం గ్రామస్తులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో జామియా మసీదు చేరుకొన్న ఆయనకు మౌజన్‌లు, ఇమామ్‌లు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీలో తగిన గుర్తింపు ఉందన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మౌజన్లకు రూ.8 వేల నుంచి రూ.12వేలు, ఇమామ్‌లకు రూ. 10 వేలు నుంచి రూ. 15 వేలకు వేతనాలను పెంచిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. షంషేర్‌వలీ దర్గా మాన్యం భూములపై నెలకొన్న వివాదం, సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ జమీర్‌ఖాన్, నాయకులు గౌస్‌భాషా, అబీద్,పర్వేజ్, రహమత్‌భాషా, మహబూబ్‌భాష, మగ్దూమ్,ఖలీల్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

ములకలచెరువు: ములకలచెరువు, ముదివేడు పోలీస్‌స్టేషన్లను అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ములకలచెరువులో పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని, సత్యసాయి, అన్నమయ్య జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎర్రచందనం, కర్ణాటక మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. స్టేషన్‌లోని రికార్డులు తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్ఐ గాయత్రి, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

తహసీల్దార్ మహబూబ్‌చాంద్



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మదనపల్లె : మండంలోని బసినికొండ రెవెన్యూ గ్రామం బీఎస్.రెడ్డి కాలనీలోని ప్రభుత్వ స్థలంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీఎస్ రెడ్డికాలనీలోని సర్వేనెం.1లో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిందిగా సంబంధిత వీఆర్వో, గ్రామ సచివాలయ సర్వేయర్‌ను ఆదేశించామన్నారు. వారు ఆక్రమణ జరిగినట్లు నిర్ధారించడంతో ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా అతిక్రమించి నిర్మాణాలు, ఆక్రమణలు చేపడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి బి. చంద్రనాయక్



పొలంబడి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పీలేరు రూరల్ : వేరుశనగ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. చంద్రనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ముడుపులవేములు రైతు భరోసా కేంద్రం పరిధిలోని బోడినాయునిదొడ్డిలో పొలంబడి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి యాజమాన్య పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. ఎఫ్‌పీవో సర్టిఫికేషన్ పొందిన రైతులకు మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని చెప్పారు. వేరుశనగ సాగులో వేప గింజల కషాయం, వేపనూనె ఆవశ్యకతను, లింగాకర్షక జిగురు పల్లేలు ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. పచ్చ పురుగు నివారణకు పక్షిస్థావరాలు, ఎర్రగొంగలి పురుగు నివారణకు విషపు ఎరను వాడి వేరుశెనగ పొలంలో శత్రు పురుగులను నివారించవచ్చునన్నారు. పూత సమయంలో 200 కిలోల జిప్సం ఎకరాకు వాడటం వలన వేరుశనగ కాయల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు ఎం.వి. శ్రీకాంత్, టి. సావిత్రి, వ్యవసాయ అధికారులు కె. సుచిత్ర, షణ్ముగం, పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు, ఏవో రమాదేవి, టి.ఎ. కరుణాకర్‌రెడిడ, ఏఈవోలు ఇంద్ర, అల్తాఫ్, ఆర్‌బీకే ఛైర్మన్ మల్లికార్జున, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21 లోపు ఓటర్లజాబితా సర్వే పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ సందీప్

తంబళ్లపల్లె: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లజాబితా వెరిఫికేషన్ కార్యక్రమాన్ని 21వ తేదీలోపు పూర్తి చేయాలని ఎన్నికల నిర్వాహణ అధికారి సందీప్ తహసీల్దార్‌లను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లు, రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన వెరిఫికేషన్ వివరాలను వివరించారు. మార్పులు, చేర్పులు, మృతి చెందిన వారి పేర్లు తొలగింపు, నూతన ఓటర్ల చేర్పులు వంటి సర్వేలు పూర్తి చేయాలన్నారు. అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల వారు అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.